## రజాకార్లను తరిమిన పోరాటయోధుడు రామిని

- సెప్టెంబర్ 17 సందర్భంగా నాటి రజాకార్లపై పోరును గుర్తు చేసుకున్న బైరాన్‌పల్లి వాసి





బైరాన్‌పల్లి బురుజు

ఎల్బీనగర్, సెప్టెంబర్ 16: రజాకార్లపై పోరాటం చేసి.. ముగ్గురు రజాకార్లను హతం చేయడమే కాకుండా, వారి సైన్యాన్ని తరిమికొట్టిన గొప్ప సాయుధవీరులు బైరాన్‌పల్లివాసులు. నాటి పోరాటంలో పాల్గొన్న వారిలో గ్రామవాసి, సాయుధ పోరాటయోధుడు రామిని వెంకటయ్య.. సెప్టెంబర్ 17 సందర్భంగా గత అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ చైతన్యపురిలో తన కుమారుడు శ్రీనివాస్‌తో కలిసి ఉంటున్న 97 ఏండ్ల వెంకటయ్య.. రజాకార్లతో పోరాడిన విషయాలను 'నమస్తే తెలంగాణ'కు వెల్లడించారు. తన 21 ఏండ్ల వయసులోనే బైరాన్‌పల్లిలోని యువకులతో కలిసి హన్మంతు, వీరారెడ్డి నాయకత్వంలో మూడు బృందాలుగా ఏర్పడ్డామన్నారు. ఊరు బురుజు, పొలిమేరలో కాపలా ఉండి రజాకార్ల దాడిని విజయవంతంగా ఎదుర్కొన్నట్టు తెలిపారు. బైరాన్‌పల్లివాసుల పోరాటానికి ముగ్గురు రజాకార్లు మృతి చెందడమే కాకుండా, మిలిగినవారు గ్రామాన్ని విడిచి పారిపోయినట్టు చెప్పారు. రజాకార్ల అకృత్యాలను ఎక్కడికక్కడ అడ్డుకున్నట్టు వివరించారు.

## తెలంగాణ రవాణా శాఖలో.. నాసిరకం చైనీస్ చిప్‌ల వినియోగం

- సరఫరా చేస్తున్న కంపెనీపై తగిన చర్యలు తీసుకోవాలి
- టెండర్లలో పాల్గొనకుండా నిషేధించాలి
- రాహత్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కమల్ సోయి




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కమల్

ఖైరతాబాద్, సెప్టెంబర్ 16: తెలంగాణ రవాణా శాఖ స్మార్ట్ కార్డుల్లో నాసిరకం చైనీస్ చిప్‌లను వాడుతున్నారని, ఇది జాతీయ భద్రతకు ముప్పు తెస్తుందని రాహత్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కమల సోయి అన్నారు. ఎర్రమంజిల్‌లోని హోటల్ మెర్క్యూలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రవాణా శాఖకు సంబంధించిన స్మార్ట్ కార్డుల పంపిణీ కోసం ఓ ప్రైవేట్ సంస్థకు ఆర్డర్ ఇచ్చారన్నారు. వారు చేసిన స్మార్ట్ కార్డులు 'స్మార్ట్ కార్డ్ ఆపరేటింగ్ సిస్టమ్ ఫర్ ట్రాన్స్‌పోర్టు అప్లికేషన్స్' నిబంధనలకు అనుగుణంగా లేవన్నారు. ఈ కార్డుల వల్ల హ్యాకింగ్, డేటా లీక్, అనధికార ప్రవేశానికి ఆస్కారం ఉన్నదన్నారు. ఇది వినియోగదారుల గోప్యతను ప్రమాదంలో పడవేస్తుందన్నారు. కలర్ ప్లాస్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు గతేడాది ఫిబ్రవరిలో తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ నుంచి ఒక సంవత్సరానికి కాంట్రాక్ట్ పద్ధతిలో ప్రీ ప్రింటెడ్ పీవీసీ 64కె కార్డులు సరఫరా చేయడానికి టెండర్లు ఇచ్చారన్నారు. చైనా మూలానికి చెందిన ఈ మాడ్యుల్/చిప్‌లు దేశ సైబర్ భద్రతకు తీవ్రమైన ముప్పుగా ఉన్నదన్నారు. కంపెనీ చేసిన ఈ తీవ్రమైన నేరపూరిత చర్యను తీవ్రంగా పరిగణించాలన్నారు. ఇప్పటికే డ్రైవింగ్ లైసెన్సు, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్సీ) నమూనాలను, టెండర్ పత్రం, సరఫరా దారుతో కుదిరిన ఒప్పందంలో ఉన్న ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయో.. లేదో పరీక్షించడానికి నేషనల్ ఇన్ఫార్మాటిక్స్ సెంటర్‌కు ఫిర్యాదు పంపినట్లు తెలిపారు. సదరు సంస్థపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

## సీఎం చూడకుండా దాచిండ్రు



ముఖ్యమంత్రి కాన్వాయ్ వెళ్లే మార్గాన్ని అరగంట ముందే భద్రతా సిబ్బంది క్లియర్ చేసేందుకు హడావుడి చేస్తుంటారు. కానీ, సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహ విష్కరణ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి వెళ్తుండగా.. ఓ యువకుడు స్పృహ తప్పి పడిపోయి ఉన్నాడు. అక్కడ భద్రతను పర్యవేక్షించే సిబ్బంది చూసి కూడా పట్టించుకోలేదు. సోయి లేక పడిపోయి ఉన్న ఆ యువకుడిని ఆస్పత్రికి తరలించాల్సింది పోయి.. అడ్డుగా గార్బేజ్ సక్కర్‌ను పెట్టారు. అక్కడే ఉండి పరిస్థితిని గమనించిన 'నమస్తే తెలంగాణ' ఫొటోగ్రాఫర్ తన కెమెరాతో ఈ దృశ్యాన్ని క్లిక్ మనిపించాడు.

## నిర్మాతపై కత్తితో దాడి చేసిన హీరో



గాయపడిన వెంకట్రావు

వెంగళరావునగర్, సెప్టెంబర్ 16: సినీ నిర్మాతపై ఓ హీరో కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మధురానగర్ ఓరా టవర్స్ సమీపంలో టి.వి.ఆర్.ఆర్ట్స్ కార్యాలయాన్ని నిర్మాత వెంకట్రావు (48) నిర్వహిస్తున్నాడు. నిర్మాత వెంకట్రావు, దర్శకుడు కృష్ణ, హీరో రామకృష్ణ కలిసి రూ.30 లక్షలు వ్యయంతో సినిమాను నిర్మించ తలపెట్టారు. రెండేండ్ల కిందట హీరో రామకృష్ణ నుంచి పెట్టుబడిలో భాగంగా రూ.2.50 లక్షలు నిర్మాత వెంకట్రావు తీసుకున్నాడు. నెలలు గడుస్తున్నా సినిమా ప్రారంభించకపోవడంతో హీరో రామకృష్ణలో అసహనం పెరిగింది. సినిమా విషయంలో వీరి మధ్య వివాదం మొదలైంది. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం మధురానగర్‌లోని కార్యాలయానికి వచ్చి నిర్మాత వెంకట్రావుతో హీరో రామకృష్ణ ఘర్షణకు దిగాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఆవేశానికి లోనైన హీరో రామకృష్ణ కిచెన్ రూమ్‌లో ఉన్న కత్తితో నిర్మాత వెంకట్రావు ఛాతిపై దాడి చేశాడు. సమాచారం అందుకున్న మధురానగర్ పోలీసులు తీవ్రంగా గాయపడిన బాధితుడిని చికిత్స కోసం స్థానిక దవాఖానకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న హీరో రామకృష్ణ కోసం గాలిస్తున్నారు.

### ద్విచక్ర వాహనాల దొంగల అరెస్ట్


సిటీబ్యూరో, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ద్విచక్రవాహనాలను దొంగిలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పల్ల ధర్మతేజ అలియాస్ సన్నీ వాహనాల దొంగ. ఏపీ, తెలంగాణలో గతంలో పలు దొంగతనాలు చేసి జైలుకు కూడా వెళ్లాడు. ఇటీవల జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత తన స్నేహితుడు శ్రీవెళ్లి గురప్ప అలియాస్ సంపత్‌తో కలిసి హైదరాబాద్‌కు వచ్చి ఐదు చోట్ల దొంగతనాలు చేశాడు. వీరిద్దరినీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేయడంతో కడపలో చేసిన మరో మూడు దొంగతనాల బయటపడ్డాయి. నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 8 బైకులను స్వాధీనం చేసుకున్నారు.

## నగరంలో అబ్కారీ దాడులు

నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం, గంజాయి పట్టివేత

డ్రై డేస్‌లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

అబ్కారీ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి



సిటీబ్యూరో, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 67 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. కర్ణాటక ప్రాంతానికి చెందిన శివప్ప సేలం జిల్లా నుంచి ప్రైవేటు ట్రావెల్ బస్సులో 67 ఆఫీసర్స్ ఛాయిస్ నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం ప్యాకెట్లను నగరానికి తరలించాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న అబ్కారీ అధికారులు మేడ్చల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.నవీన్ ఆదేశాల మేరకు కుత్బుల్లాపూర్ మాధవపురం ప్రాంతంలో ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆపి తనిఖీ చేయగా.. టెట్రా ప్యాకెట్ల రూపంలో 67 మద్యం ప్యాకెట్లు బయటపడ్డాయి. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

### గంజాయి పట్టివేత.. దంపతుల అరెస్ట్

ధూల్‌పేటలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు దంపతులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్టీఎఫ్ అధికారులు పట్టుకుని అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి 2.160 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్టీఎఫ్ అధికారి నంద్యాల అంజిరెడ్డి కథనం ప్రకారం.. జుమ్మేరాత్ బజార్‌కు చెందిన మహేందర్‌సింగ్, అతడి భార్య సునీత బాయి.. అదే ప్రాంతానికి చెందిన దుర్గేశ్, అంగూర్‌బాయి కలిసి గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్టీఎఫ్ బృందం సోమవారం దాడులు జరిపి మహేందర్‌సింగ్ దంపతులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 2.168 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కాగా, దుర్గేశ్, అంగూర్‌బాయిపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

### డ్రై డేస్‌లో.. విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రస్తుతం వినాయక నిమజ్జనం నేపథ్యంలో మద్యం అమ్మకాలపై విధించిన నిషేధం సందర్భంగా డ్రై డేస్‌లో(నిషేధిత రోజుల్లో)ఎవరైనా మద్యం అమ్మకాలు జరిపితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, నిబంధనలు ఉల్లంఘించిన వైన్ షాపు లేదా బార్ అండ్ రెస్టారెంట్‌కు సంబంధించిన లైసెన్స్‌ను కూడా రద్దు చేస్తామని అబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి హెచ్చరించారు.

## మద్యం మత్తులో యువకుల దాడి

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి గాయాలు

మలక్‌పేట, సెప్టెంబర్ 16: వెనుక వైపు నుంచి వచ్చి కారుతో ఢీకొట్టినందుకు ప్రశ్నించిన ముగ్గురిపై మద్యం మత్తులో ఉన్న యువకులు దాడి చేశారు. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు గాయాలపాలయ్యారు. మలక్‌పేట పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. శాలివాహన నగర్ నివాసి కె.విజయేందర్‌రెడ్డి తన కూతురును దవాఖానకు తీసుకెళ్లి, తిరిగి ఇంటికి వస్తుండగా, మద్యం మత్తులో ఉన్న యువకులు వెనుక వైపు నుంచి వచ్చి కారును ఢీకొట్టారు. దీంతో విజయేందర్‌రెడ్డి, అతడి భార్య నిర్మల రెడ్డి, అల్లుడు సాయి పవన్‌రెడ్డి కారు దిగి వారిని ప్రశ్నించారు. మద్యం మత్తులో ఉన్న ఆ యువకులు వాగ్వాదానికి దిగి.. వారిపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో విజయేందర్ రెడ్డి, నిర్మల రెడ్డి, సాయి పవన్‌రెడ్డికి గాయాలు కాగా.. చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. జరిగిన ఘటనపై నిర్మల రెడ్డి మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు దాడికి పాల్పడిన అఖిల్ అనే యువకుడిని అదుపులోకి తీసుకొని బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించగా, మద్యం సేవించినట్లు వెల్లడైంది. అఖిల్‌తోపాటు మరో 20 మంది యువకులు ఈ దాడికి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు మలక్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### పందిని ఢీకొట్టి.. యువకుడి మృతి



మృతి చెందిన సునీల్

కందుకూరు, సెప్టెంబర్ 16: పంది ఓ యువకుడి ప్రాణం తీసింది. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్ల అనుబంధ గ్రామం ఖాజిగూడ తండాకు చెందిన సునీల్ (28) సోమవారం ఉదయం తన బైక్‌పై మండల పరిధిలోని బేగరికంచె నుంచి తన గ్రామానికి వెళ్తుండగా.. కందుకూరు గేటు సమీపంలో ఒక పంది బైక్‌కు అడ్డంగా వచ్చింది. సునీల్ బైక్‌తో పందిని ఢీకొట్టి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ సీతారాం ఆధ్వర్యంలో ఎస్సై సైదులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించాడు.

### బైక్‌ను ఢీకొట్టిన లారీ

వాచ్‌మన్ దుర్మరణం

దుండిగల్, సెప్టెంబర్16: వేగంగా దూసుకొచ్చిన రెడీమిక్స్ లారీ అదుపుతప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి ఆ లారీ టైర్ల కిందపడి అక్కడికక్కడే దుర్మరణం చెందగా, అతడి భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన రాకేశ్‌రాయ్(33) కుటుంబసభ్యులతో కలిసి కొంత కాలం కిందట నగరానికి వలసొచ్చాడు. బౌరంపేటలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనం వద్ద రాకేశ్‌రాయ్ వాచ్‌మన్‌గా పనిచేస్తూ.. అక్కడే కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. సోమవారం ఉదయం రాకేశ్‌రాయ్ దంపతులిద్దరూ తమ ద్విచక్ర వాహనంపై షాపూర్‌నగర్ మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేసేందుకు వెళ్తుండగా హెచ్‌పీ పెట్రోల్ బంక్ మూలమలుపు వద్ద మియాపూర్ నుంచి బహదూర్‌పల్లి వైపు వేగంగా దూసుకొచ్చిన కాంక్రీట్ రెడీమిక్స్ లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పైనుంచి దంపతులు రోడ్డుపై పడిపోయారు. రాకేశ్‌రాయ్ పైనుంచి రెడీమిక్స్ లారీ వెనుక టైర్లు దూసుకువెళ్లాయి. దీంతో తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందగా, అతడి భార్యకు గాయాలయ్యాయి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా వైద్యశాలకు తరలించారు. గాయపడిన మహిళ ఓ వైద్యశాలలో చికిత్స పొందుతున్నది. ఈ ప్రమాదానికి లారీ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగమే కారణమని పోలీసులు పేర్కొన్నారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడని తెలిపారు.

### తండ్రి నడుపుతున్న లారీ కింద పడి బాలుడి మృతి



విఘ్నేశ్ (ఫైల్)

బండ్లగూడ, సెప్టెంబర్ 16: ఓ చిన్న నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని బలిగొంది. తండ్రి నడుపుతున్న లారీ చక్రాల కింద నలిగి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కర్నూల్‌కు చెందిన కృష్ణ బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి.. ఇటుకలు తయారు చేసే కంపెనీలో లారీ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నారు. కృష్ణకు ఇద్దరు కూతుళ్లతో పాటు 3 ఏండ్ల విఘ్నేశ్ ఉన్నాడు. కృష్ణ ఇటుకల లోడ్ తీసుకుని బయటకు వెళ్లే క్రమంలో.. బాలుడు ఏడుస్తుండగా అతడికి చాక్లెట్లు ఇప్పించి ఇంట్లో దిగబెట్టాడు. కృష్ణ యథావిధిగా లారీ వద్దకు వచ్చి లారీని తీసుకుని వెళ్తుండగా.. ఆ బాలుడు లారీ చక్రాల కిందకు వచ్చాడు. గమనించని కృష్ణ లారీని ముందుకు తీయడంతో బాలుడు ఆ లారీ చక్రాల కిందపడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. అనంతరం వారు బాలుడి మృతదేహంతో కర్నూల్‌కు వెళ్తున్నట్లు తెలిపారు. కేసును పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

## ఆచార్య అమరేశం రాజేశ్వర శర్మ కన్నుమూత



సిటీబ్యూరో, సెప్టెంబర్ 16 ( నమస్తే తెలంగాణ ): తెలుగు భాషాభివృద్ధికి విశేష సేవలందించిన ఆచార్య అమరేశం రాజేశ్వర శర్మ ఆదివారం రాత్రి కన్ను మూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన అంతిమ సంస్కారాలు సోమవారం మలక్‌పేటలో ముగిశాయి. తెలుగు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులుగా, కాకతీయ విశ్వవిద్యాలయ డీన్‌గా సేవలందించారు. వ్యాకరణం బోధించడంలో దిట్ట. కామారెడ్డిలో 1930లో రాజేశ్వర శర్మ జన్మించారు. ఆంధ్ర వ్యాకరణ వికాసం, నన్నెచోడుని కవిత్వం, వేదం వెంకటరాయ శాస్త్రి వ్యాఖ్యానాలు, గజ్జెల విస్తరి, చరిత్ర పుటలు వంటి ఎన్నో గ్రంథాలు రచించారు. శారద మంజీరము, పోతన భాగవత పంచశతి నీరాజనము, పోతన పంచశతి స్మారికలకు సంపాదకత్వం వహించారు. ప్రాచ్య విద్యా పరిషత్తు స్థాపక కార్యదర్శి అధ్యక్షులుగా 1970– 2015 వరకు, పోతన పంచకతి మహోత్సవ కార్యదర్శిగా 1979–9182 వరకు సేవలందించారు. కామారెడ్డి, ఆర్మూరు, తాండూరు, నాంపల్లి, సుల్తాన్‌బజార్ ప్రభుత్వ హైస్కూళ్లలో విధులు నిర్వర్తించారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.


## నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**ఓం శివదుర్గా జ్యోతిష్యం**

★ వీరు శివదుర్గ దైవశక్తితో కేరళ సమాధి జపం సర్వమంత్ర సిద్ధి పొంది వున్నారు. అఘోర మరియు నాగసాధువులతో కలిసి సాధన పొంది వున్నారు. ఎటువంటి సమస్యలకైనా 11 రోజులలో పరిష్కారం, శివం రోడ్. ఫోన్: 9866177085 NT-331742

**కేరళ ఆయుర్వేద పంచకర్మ**

★ శ్రీ రామాంజనేయ కేరళ ఆయుర్వేద పంచకర్మ, పటాన్ చెరు, స్పైన్ (వెన్నుపూస) సమస్యలు, డిస్క్ ప్రాబ్లమ్స్, పర్మినెంట్ క్యూర్ చేయబడును. సంప్ర: డా. సి.హెచ్.రావ్, ఫోన్: 9441279624. NT-331761

**PACKERS & MOVERS**



★ Sri Sai Packers & Movers Local and all over India, Resonable Price. Head Office Nacharam: 27176927, Ameerpet: 9866379391, DSNR: 9666993927, KKP: 9949513929, MP: 9848263927, ECIL: 9666983927. NT-332636

**GOLD FINANCE**



★ మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి, మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9398709618. NT-333108

★ మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-335055

**BUSINESS OFFER**

★ మంచి ప్రాఫిట్‌గల బిజినెస్‌కి బిస్కెట్స్ & జనరల్ ఐటమ్స్ హోల్‌సేల్ చేయడానికి ఇన్వెస్ట్‌మెంట్ పార్ట్‌నర్స్ కావలెను. 8106734546. NT-332644

**TOURS & TRAVELS**



★ మహాదేవ టూర్స్: 20/09 చార్‌ధామ్ 26 వేలు 12 క్షేత్రా; 06/11 కాశీ 16 వేలు 7 క్షేత్రా; 25/11 రామేశ్వరం 19 వేలు 25 క్షేత్రా; 20/11 కామాఖ్యా + ఖాశీ 13 క్షేత్రా 30 వేలు స్లీపర్ బస్సు. @ 9908844377. NT-336713

**OLD AGE HOME**



★ వృద్ధులు, Rtd. ఎంప్లాయీస్ విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, 24/7 మెడికల్ సర్వీస్, ఉప్పల్ మరియు ECIL- కీసర రోడ్, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతితో. ఫోన్: 7981467036, 9391039990, 8074327715. NT-331743

**PLOT FOR SALE**



★ ఘట్‌కేసర్‌లో కలిసిన GHMCలో HMDA ప్లాట్లు తక్కువ ధరకు కలవు. ఇప్పుడే ఇళ్లు కట్టుకోవచ్చు. కొన్ని ప్లాట్లు కలవు. 9704695889, 9505980640. NT-332599

**WANTED**




★ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో మార్కెటింగ్ చేయుట కొరకు స్త్రీ, పురుషులు, గృహిణులు, రిటైర్డ్, విఆర్ఎస్ మరియు ఎల్ఐసి వారు కావలెను. (పూర్తిరోజు), (కొంత సమయం). వయస్సుతోకానీ చదువుతోకానీ సంబంధం లేదు. అర్హత, అనుభవాన్నిబట్టి హోదా నిర్ణయించబడును. సంప్రదించండి: 8317650709. NT-336708

★ ఇంట్లో ఇంటిపని, వంటపని చేయుటకు ''ఆంధ్ర ఆడ వంటమనిషి'' కావలెను. మంచి జీతం + ఫ్రీ ఫుడ్ + ఫ్రీ వసతి ఇవ్వబడును. ఫోన్: 9985168764. NT-331680

★ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో Sales & Door to Door మార్కెటింగ్ చేయడానికి Males & Females కావలెను. Quali: Inter, Degree. మంచి Salary + కమీషన్. Office: Uppal. 8341205679. NT-336719

★ డ్రైవర్ అవసరం! హైదరాబాద్‌లో ఎవరెస్ట్ ఫ్లీట్ CNG కార్ డ్రైవ్ చేయండి మరియు నెలకు Rs. 25,000* సంపాదించండి!! +91 9324912075 కి కాల్ చేయండి. NT-075

**CHANGE OF NAME**

★ I, RATIK AGARWAL, S/o. Pankaj Agarwal, R/o. No. 3-4-174/AF/8, Ambience Fort, Hyderguda, Spencer Lane, Rajendranagar, have Changed My Name to RATIK KUMAR AGARWAL for all purposes. NT-11932

★ I, SAROJA KOTTURU, D/o. Sankar Rao, R/o. Flat No. 201, Opal Square Apartment, Mayuri Nagar, Miyapur-500 049, have Changed My Name to SHARON ROJA KOTTURU for all purposes, vide Affidavit Dated 14-09-2024 at Hyderabad. NT-Giridhar

★ I, VENKAT RAO, S/o. Venkateswaralu, R/o. Prasanth Nagar, Uppal, Hyd-500 039. Changed My Name as THANNIRU VENKAT RAO for future purposes. NT-334803

**LOST**

★ I, GUDURU SANTOSH ADITYA REDDY, S/o. Guduru Pratap Reddy, R/o. 11-13-1002, Plot No. 29, Road No. 2, Green Hills Colony, Kothapet, Saroornagar, Ranga Reddy-35, T.S. Lost My Original Passport No: N0491207 while travelling from Kothapet Omni Hospital to Green Hills Colony, Kothapet. Ph: 8074387772. NT-335161

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

4 లైన్లకు రూ.400/- (5% GST అదనం) ప్రతి అదనపు లైనుకు రూ.75/-

పూర్తి వివరాలకు: 'నమస్తే తెలంగాణ' ప్రధాన కార్యాలయం, #8-2-603, 1/7, 8 & 9, Krishnapuram, Rd. No.10, Banjara Hills, Hyderabad-34. Cell: 9848077857

దిల్‌సుఖ్‌నగర్ : 9182777805
మల్కాజిగిరి, E.C.I.L: 9182777125
L.B.నగర్, వనస్థలిపురం : 9182777209
ఉప్పల్, తార్నాక : 9182777806
అమీర్‌పేట్, మెహిదీపట్నం : 9182777126
B.N.రెడ్డి నగర్, సంతోష్‌నగర్ : 9182777204
కూకట్‌పల్లి, బాలానగర్ : 9182777205


## న్యాయవ్యవస్థ పరీక్షల్లో.. ఓబీసీలకు అన్యాయం జరగడం శోచనీయం




తెలంగాణ జూనియర్ అడ్వకేట్స్ అసోసియేషన్ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

తెలుగు యూనివర్సిటీ, సెప్టెంబర్ 16: సామాజిక న్యాయం కల్పిస్తూ జూనియర్ సివిల్ జడ్జి, జిల్లా జడ్జిల రాత పరీక్షల్లో ఓబీసీ అభ్యర్థులకు కనీస మార్కుల కట్ ఆఫ్‌లో సడలింపు కల్పించాలని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ జూనియర్ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెడ్‌హిల్స్‌లోని ఫ్యాప్సీ హాలులో సోమవారం అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల వంశీకృష్ణ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన న్యాయ వ్యవస్థలో సామాజిక న్యాయం అమలు కాకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. సృజనాత్మక ఆలోచనలు కలిగిన న్యాయవాదులకు సమాజం అండగా నిలిచి ప్రోత్సహించాలని సూచించారు. రాజ్యసభ మాజీ సభ్యులు వి.హనుమంతరావు మాట్లాడుతూ.. జ్యూడీషియల్‌లో జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కొనేలా న్యాయవాదులు చేస్తున్న పోరాటానికి తనవంతు కృషి చేసి, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి వివరించి తగిన న్యాయం చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఓబీసీలకు న్యాయ వ్యవస్థలో న్యాయం జరగాలంటే అగ్రకులాల కుట్రలను ఎదుర్కొనాలని సీనియర్ న్యాయవాది వి. రఘునాథ్ సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఓబీసీలకు రిలాక్సేషన్ అమలులో ఉన్నదని, అదే విధంగా తెలంగాణలో కూడా అమలు చేయాలని అసోసియేషన్ అధ్యక్షులు వంశీకృష్ణ కోరారు. జూనియర్ సివిల్ జడ్జి, జిల్లా జడ్జిల పరీక్షల్లో బీసీలకు అన్యాయం జరిగితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, నాయకులు ఎర్ర సత్యనారాయణ, జనార్దన్, సునీల్‌గౌడ్, ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


## వినాయక నిమజ్జనంలో విషాదం

గుండె పోటుతో ఓ వ్యక్తి మృతి

బండ్లగూడ,సెప్టెంబర్ 16: గణేశ్ నిమజ్జనంలో పాల్గొని ఆడి పాడిన ఓ వ్యక్తి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మణికొండ అల్కాపూర్ టౌన్ షిప్‌లో నివాసముండే శ్యామ్‌కుమార్(41) ఆదివారం రాత్రి గణేశ్ మండపం వద్ద లడ్డూ వేలం పాటలో పాల్గొన్నాడు. అనంతరం నిమజ్జనం సందర్భంగా స్నేహితులు, అసోసియేషన్ సభ్యులతో కలిసి డాన్స్‌లు చేశాడు. ఉన్నట్టుండి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో తోటి కాలనీ వాసులు అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లుగా తెలిపారు. దీంతో అల్కాపూర్ టౌన్‌షిప్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. అప్పటి వరకు తమతో ఆడి పాడిన శ్యామ్ ఇక లేడన్న వార్తతో రోదనలు మిన్నంటాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఎస్సీ కులగణన చేసిన తర్వాతే.. వర్గీకరణ చేపట్టాలి

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి డిమాండ్



గన్‌ఫౌండ్రిలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు జె.చెన్నయ్య, బేర బాలకిషన్ తదితరులు

సుల్తాన్‌బజార్,సెప్టెంబర్ 16: ఎస్సీ కులగణన చేసిన అనంతరమే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు జె.చెన్నయ్య, బేర బాలకిషన్ (బాలన్న) ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గన్‌ఫౌండ్రిలో అన్ని మాల సంఘాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 50 లక్షల మంది మాలలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని తీవ్రంగా కృషి చేసినా.. మాలలకు అన్యాయం చేసేందుకు ఎస్సీ వర్గీకరణ కమిటీని వేసి సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇటీవల ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వర్గీకరణ పోరాట సమితి తీవ్రంగా ఖండిస్తున్నదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాల, మాదిగలతో పాటు 59 ఉప కులాలు ఉన్నాయన్నారు. ఎస్సీలలో కులగణన చేపట్టిన అనంతరమే ఎస్సీ వర్గీకరణ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. త్వరలోనే మరోమారు ఎస్సీ వర్గీకరణ విషయమై సీఎం రేవంత్ రెడ్డిని కలిసి పునః పరిశీలించాలని కోరడం జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వం స్పందించకపోతే తెలంగాణలోని 50 లక్షల మందికి అన్యాయం జరుగకుండా ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల, జిల్లా కేంద్రాల్లో వర్గీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు, నవంబర్ నెలలో పది లక్షల మందితో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ఈ సమావేశంలో తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు చెరుకు రాంచందర్, తాళ్లపల్లి రవి, డి.సర్వయ్య, కరణం కృష్ణ, మంత్రి నర్సింహా, గుడిమాళ్ల వినోద్, చేతన్, దుబ్బాక నవీన్, జంగం శ్రీను, బూర్గుల వెంకట్, నల్లాల కనకరాజు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.